- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందక పెన్షనర్ల ఇక్కట్లు
- జిల్లాలో 18 నెలల్లో రిటైరైన వారు 672 మంది
- ఒక్కొక్కరికి రావాల్సినవి రూ.30 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు



తప్పని ఎదురుచూపులు

జగిత్యాలలో ధర్నా చేస్తున్న పెన్షనర్లు

జగిత్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు (పెన్షనర్లు) తీవ్ర ఆవేదనలో ఉన్నారు. పెన్షనరీ బెనిఫిట్స్ అందక, వైద్యానికి డబ్బుల్లేక ఆర్థిక అవస్థల్లో పలువురు కొట్టుమిట్టాడుతున్నారు. ఇంట్లో ఎదిగిన బిడ్డ పెళ్లి చేయలేక కొందరు, ఇంటి ఖర్చులకు డబ్బులు లేక మరికొందరు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగ విరమణ పొందాక జీవిత కాలం దాచుకున్న డబ్బు వస్తుందనుకొని తెలిసిన వాళ్ల నుంచి, బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న వారు దానికి వడ్డీ, ఈఎంఐలు కట్టలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవలందించి, రిటైర్మెంట్ తర్వాత వచ్చే బెనిఫిట్స్ కోసం కార్యాలయాల చుట్టు తిరిగితే పని కావడం లేదు. పదవీ విరమణ పొంది ఏడాదిన్నర అవుతున్నా బెనిఫిట్స్ అందక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల నల్లగొండ జిల్లాలో తనకు రావాల్సిన బెనిఫిట్స్ అందకపోవడంతో మనోవేదనతో ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడు. ఆయన ఎక్కడున్నాడో ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కొందరికి కనీసం వైద్యానికి డబ్బులు అందక అనారోగ్యం పాలవుతున్నారు.

● కోట్ల రూపాయల బకాయిలు

సాధారణంగా రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు పనిచేసిన కాలంలో జమ చేసుకున్న జీపీఎఫ్‌తో పాటు, ఇతర ప్రయోజనాలు అన్నింటినీ కలిపి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం ఉద్యోగ విరమణ చేసిన నెల లోగానే అందజేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఏడాదిన్నర గడుస్తున్నా పెన్షనర్లకు ఆ సొమ్ము ఇవ్వడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 సంవత్సరంలో ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచింది. ఆర్థిక భారంతో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకనే అప్పట్లో ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచిందన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. మాజీ సీఎం కేసీఆర్ గతంలో పెంచిన ఉద్యోగ విరమణ వయస్సు వల్ల నిలిచిపోయిన రిటైర్మెంట్లు 2024 మార్చి 31వ తేదీతో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో అప్పటి నుంచి సుమారు 8,672 మంది రిటైరయ్యారు. జగిత్యాల జిల్లాలో 672

(మిగతా 8వ పేజీలో)

● 17న హైదరాబాద్‌లో ధర్నా

ఉద్యోగుల క్యాడర్ (స్థాయి)ను బట్టి ఒక్కో ఉద్యోగికి కనీసం రూ.30 లక్షలు నుంచి అత్యధికంగా రూ.80 లక్షలు రావాల్సి ఉంది. ఇందులో జీపీఎఫ్ కింద ఒక్కో ఉద్యోగికి దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు, గ్రాట్యూటీ కింద సుమారు రూ.16 లక్షల వరకు, లీవ్ ఇన్‌క్యాష్‌మెంట్ కింద రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు, కమ్యూటేషన్ కింద రూ.7 లక్షల నుంచి రూ.15 లక్షలు, టీజీఎల్ఐ కింద సుమారు రూ.5 లక్షల వరకు, జీఐఎస్ కింద సుమారు రూ. 20 వేల వరకు బెనిఫిట్స్ రావాల్సి ఉంది. ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వంతో గతంలో జరిపిన చర్చల నేపథ్యంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ చొరవతో మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ డబ్బులు గత నెలలో కొంత మొత్తంలో మంజూరు చేయించారని సంబంధిత వర్గాలు అంటున్నాయి. కాగా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ బిల్లులు అందక కొంత మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు న్యాయ పోరాటం చేస్తున్నారు. దీనిపై నాలుగు, ఆరు వారాలు గడువులోగా ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిన సందర్భాలున్నాయి. ఈ కుబేర్ సాఫ్ట్‌వేర్‌లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు కావడం లేదని అంటున్నారు. దీంతో నగదు రహిత వైద్య సేవలు అందించడం లేదు. దీంతో పెన్షనర్లు జేఏసీ ఆధ్వర్యంలో నవంబరు 17న హైదరాబాద్‌లో ధర్నాకు సిద్ధమవుతున్నారు.

నేడు డ్రా పద్ధతిన వైన్‌షాపుల ఎంపిక

-ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ

జగిత్యాల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 71 మద్యం షాపులకు సోమవారం జిల్లా కేంద్రంలోని విరుపాక్షి గార్డెన్‌లో కలెక్టర్ సత్యప్రసాద్ సమక్షంలో డ్రా పద్ధతిన నిర్వాహకులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకున్న వారు సమయానికి హాజరు కావాలని ఆయన సూచించారు. జిల్లాలో 71 మద్యం షాపులకు గాను 1,966 దరఖాస్తులు వచ్చాయి. గతంతో పోల్చితే దరఖాస్తులు తగ్గినప్పటికీ ప్రస్తుతం ఆదాయం పెరిగింది. గతంలో దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు ఉండగా ప్రస్తుతం దాన్ని రూ.3 లక్షలకు పెంచడంతో రూ.6.26 కోట్ల అదనపు ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. జిల్లాలో అత్యధికంగా వెల్గటూర్ మండల కేంద్రంలోని దుకాణం నంబర్ 45కి అత్యధికంగా 61 దరఖాస్తులు వచ్చాయి.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కథలాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్ళపల్లి, దూలూరు, బొమ్మెన గ్రామాల్లో సోమవారం సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ పుండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషహరిప్రసాద్ తెలిపారు. రైతులు తమ ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని కోరారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పకడ్బందీగా కేంద్రాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఏపీఎం చిన్నరాజయ్య తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొడిమ్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):: కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003-2004 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు గురువులకు సన్మానం చేసారు. పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలను చేశారు.

నియామకం

కథలాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యూత్ కార్యదర్శిగా మండలంలోని చింతకుంటకు చెందిన బైర దేవ్‌ను నియమిస్తూ ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల యశ్వంత్‌రాజ్‌యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర మహాసభలో తీర్మాణం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. బైర్ దేవ్‌కు నియామక పత్రం అందించి శాలువాతో సత్కరించారు.

ఘనంగా వినాయక ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం వినాయక విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు చెరుకు మహేశ్వర శర్మ, మహేష్ శర్మలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కాయితి మురళి, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, మాజీ ఉప సర్పంచ్ అన్నవేణి వేణు, బొడ్డుపల్లి విజయ్, పొడకంటి హరీష్, మామిడాల నాగరాజు, కొమ్మ దిలీప్, గంగరాజం, గోపి, అరవింద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

‘బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపాలి’

బీర్‌పూర్,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు అన్ని పార్టీలు మద్దతు తెలపాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహంకాళి రాజన్న అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చేపట్టిన బంద్, నిరసన కార్యక్రమాలు ఏ పార్టీకి వ్యతిరేకంగా చేశారో అర్థం కాని పరిస్థితి ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహంకాళి రాజన్న అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బీసీలు తమకు రిజర్వేషన్ల శాతం పెంచాలని చేస్తున్న నిరసనకు మద్దతుగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందేనన్నారు. అదే కోవలో బీజేపీ, బీఆర్ఎస్‌లు కూడా మద్దతు ప్రకటించడంతో రాష్ట్ర ప్రజలు అయోమయానికి గురయ్యారని అన్నారు. అన్ని పార్టీ నిరసనలు చేసి బంద్‌లో పాల్గొంటే బీసీల కోరికలు ఏ పార్టీ నెరవేరుస్తుందని ప్రశ్నించారు. ఈ నిరసన, బంద్‌లకు సమాధానాలు ఎవరు ఇవ్వాలి అని ఆయన అన్నారు. గురి లేని ప్రయాణం చేస్తున్నట్లుగా బీసీల నిరసనలు అర్థం లేకుండా పోయిందని ఎవరిమీదా పోరాటం చేస్తున్నాము మన కోరికలు తీర్చేది ఎవరు అనే విషయాన్ని బీసీలకు అర్థం అయ్యేలాచెప్పడం మంచిదని గుర్తు చేశారు. ఇప్పటికైనా మేధావులు, అనుభవం ఉన్నా రాజకీయ నాయకులు ఎవరినై ఏ పార్టీ మీద నిరసన చేయాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహంకాళి రాజన్న అన్నారు. ఎవరిపై నిరసన చేస్తే బీసీల కోరిక తీరుతుందో అర్థం అయ్యేలా ప్రజలకు చెప్పాలని కోరారు. బీసీలకు 42 శాతం ఎస్సీలకు 24 శాతం ఎస్టీలకు 12 శాతం ఇచ్చి మిగతా ఓసీలకు రిజర్వేషన్లు ఇస్తే దేశంలో ఎలాంటి గొడవలు ఉండవని తన అభిప్రాయాన్ని తెలిపారు.

స్లీపర్ బస్సులు భద్రమేనా..?

- నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ 7

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

-సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్‌రావు 6

క్రీడలతో మానసికోల్లాసం

-ఎస్పీ అశోక్ కుమార్





బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ అశోక్ కుమార్, ట్రోఫీని అందజేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. మీడియా, పోలీసులు సమాజంలో ఒకే లక్ష్యంతో పని చేస్తాయని ఆయన అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో పోలీస్ వర్సెస్, ప్రెస్ జట్ల మధ్య ఆదివారం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు.

అనంతరం విజేతగా నిలిచిన పోలీస్ జట్టుకు, రన్నర్ అప్ నిలిచిన పాత్రికేయుల జట్టుకు కప్ అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసి కోల్లాసం పెంపొందుతుందన్నారు. ప్రెస్, పోలీసుల మధ్య మంచి కోఆర్డినేషన్ ఉండడానికి ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించామని ఎస్పీ ఈసందర్భంగా పేర్కొన్నారు.

● ఉత్సాహంగా పోలీస్, ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

జిల్లా పోలీస్ టీం వర్సెస్, ప్రెస్ టీం జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. టాస్ గెలిచిన ప్రెస్ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 12 ఓవర్లకు ప్రెస్‌జట్టు 90 పరుల స్కోర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన పోలీస్ జట్టు నిర్ణీత 12 ఓవర్లకు 91 పరుగులు చేసి విజయం సాధించింది. ఎస్పీ చాలా సేపు క్రీజ్‌లో నిలదొక్కుకొని పోలీస్ టీం విజయంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం ఎస్పీ ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, రఘుచందర్, రాములు, జగిత్యాల ఐజేయూ జిల్లా అధ్యక్షుడు చాటి శ్రీనివాస్‌రావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ అరిఫ్ అలీఖాన్, సీఐలు అనిల్ కుమార్, రామ్ నరసింహారెడ్డి, సురేష్, రవి, కరుణాకర్, ఆర్ఐలు సైదులు, వేణు, ఎస్ఐలు, పాత్రికేయులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా బైరం హరికిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.జిల్లా కేంద్రంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాలెపు శివరామకృష్ణ, ట్రెజరర్‌గా మేకల ప్రవీణ్, రాష్ట్ర కౌన్సిలర్‌లుగా మచ్చ శంకర్, సీర్లవంచ రవీంధర్, శనిగరపు రవిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సయ్యద్ సాబీర్ అలీ తెలిపారు. వీరితో పాటు జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా బండి శ్రీనివాస్, కచ్చు రాజన్న, జిల్లా ఉపాధ్యక్షులుగా నంద్యాల నాయక్, సుద్దాల శ్రీధర్, అఖిల్ అహ్మద్, సిరుప పూర్ణచందర్, పుప్పాల ఆత్మరాం, పతంగి మహేష్, అడ్డగట్ల గంగాధర్, తాటికొండ తిరుపతి చారి, జోగ రవి, శీలం నర్సయ్య, జిల్లా మహిళా ఉపాధ్యక్షులుగా ముక్క కవిత, కొత్తగట్టు శ్రీలత, నల్ల శ్వేత, అదనపు కార్యదర్శులుగా నరేష్, ఆడెపె రాజశేఖర్, జిల్లా కార్యదర్శులుగా దశరథరెడ్డి, ఎండీ నజ్ముద్దీన్, రాంపల్లి రాజేంద్ర ప్రసాద్, ఊరడి ప్రభాకర్, సంకె మహేష్, సంగీ శంకర్, కటకం రమేష్, మహిళా కార్యదర్శిలు కటకం కవిత, ప్రేమలత, ఆర్థిక కమిటీ సభ్యులుగా కటకం పరంధాం, అంతడుపుల శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

కమ్మునూర్ బ్రిడ్జితోనే సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల అభివృద్ధి

సారంగాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు గుర్తింపు వచ్చింది కమ్మునూర్, కలమడుగు బ్రిడ్జి వల్లనే అని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కమ్మునూర్, కలమడుగు రెండు గ్రామాల మధ్య గోదావరి నది పై నిర్మించిన బ్రిడ్జి ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు వాణిజ్యపరంగా ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కాలువల ఏర్పాటు సమయంలో బీర్‌పూర్ ప్రాంతంతో పాటు ధర్మపురికి నీటి ఎద్దడి రాకుండా రాజుల చెరువును 0.25 టీఎంసీ సామర్థ్యంతో రోళ్లవాగు ప్రాజెక్టుగా రూపొందించడం జరిగిందన్నారు. సాగునీటితో పాటు తాగు నీటి కోసం బీర్‌పూర్ మండల కేంద్రంలో రక్షిత మంచినీటి ఫిల్టర్ బెడ్ సౌకర్యం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రతి మండలానికి ఒక ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలని భావించారన్నారు. ఆ తరుణంలో దివంగత స్వర్గీయ కొండ్ర మల్లారెడ్డి రెండు మండలాల్లో ఇంటర్ కాలేజీలు ఏర్పాటు చేసి విద్యారంగ అభివృద్ధికి ప్రధానంగా కృషి చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ కరీంనగర్ పర్యటనకు వచ్చినప్పుడు రాయికల్ మండలంలోని బోర్నపల్లి, కడెం మండలంలోని టిల్లాల రెండు గ్రామాల మధ్య గోదావరి బ్రిడ్జిపై వంతెన నిర్మిస్తే భవిష్యత్తు ఉంటుందని చెప్పడంతో రూ.70 కోట్లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. గత ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం అప్పుడు ప్రాతినిధ్యం వహించిన ప్రజాప్రతినిధుల మూలంగా నేడు బీర్‌పూర్ ప్రాంత రైతాంగం, మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, నాయకలు కొండ్ర రాంచందర్‌రెడ్డి, ముక్క శంకర్, గుడిసె జితేందర్ యాదవ్, సిగిరి రాజిరెడ్డి, సుభాష్ యాదవ్, లక్ష్మణ్, కొక్కు గంగారాం, చేకుట శేఖర్, ఉపేందర్ ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

గుంతల పూడ్చివేత

జగిత్యాలరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులో గొల్లపల్లి వెళ్లే రహదారిలోని గుంతలను పోలీసులు పూడ్చివేశారు. నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎస్పీ కార్యాలయంలో పనిచేసే కానిస్టేబుల్ సంతోష్, ధర్మపురి సీఐ రైటర్ రమేష్‌లు ప్రమాదాలు జరుగకుండా గుంతలను పూడ్చారు. ఈసందర్భంగా స్థానికులు పోలీసులను అభినందించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

రాయికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ వెలమ సంక్షేమ సంఘ భవనానికి నిధుల మంజూరుకు కృషి చేసిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు, అల్లీపూర్ వెలమ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గోదావరి నదిలో ప్రేమికుల గల్లంతు

● యువకుడిని కాపాడిన జాలర్లు.. యువతి మృతి

ఫైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పుణ్యస్నానానికని గోదావరినదికి వెళ్లిన ప్రేమజంట ప్రమాదవశాత్తు నదిలో గల్లంతయ్యారు. ఈప్రమాదంలో యువకుడిని జాలర్లు కాపాడగా యువతి మృతిచెందింది. గోదావరిఖనికి చెందిన దానవేన రవితేజ, పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు గ్రామానికిచెందిన ఓ యువతి(17) కొన్నాళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్ళిచేసుకోవాలని ఇద్దరు నిర్ణయించుకున్నారు. రవితేజ బంధువు ఇటీవల మృతిచెందగా, పెళ్లికి ముందు నదీస్నానం ఆచరించాలనే కుటుంబ సంప్రదాయం మేరకు ఆదివారం రవితేజ కుటుంబం గోదావరినది వద్ద ఉన్న సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద స్నానానికివెళ్లారు. ఇద్దరూ నదిలోకివెళ్లగా ప్రవాహంలో కొట్టుకుపోయారు. అక్కడేఉన్న జాలర్లు ఇద్దరిని కాపాడే ప్రయత్నం చేశారు. రవితేజను మొదట ఒడ్డుకుచేర్చిన జాలర్లు, తర్వాత యువతిని కాపాడి ఒడ్డుకుచేర్చే సమయానికే ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఇన్‌స్టాగ్రాంలో పరిచయం అయిన రవితేజ, యువతి వేర్వేరు కులాలకు చెందినవారు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయిం చుకున్న తర్వాత యువతి నెలరోజులక్రితం గోదావరిఖనికి వచ్చి రవితేజకుటుంబంతో ఉంటున్నది. యువతికి అక్టోబరునెలతో మైనారిటీ పూర్తయి మేజర్ అవుతుంది. నవంబరు1న వారిద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇంతలోనే ఆమె ప్రాణాలు కోల్పోయింది.

వివాహిత ఆత్మహత్య

రాయికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికిచెందిన డొడిమెల్ల మనోజ(27) అనే వివాహిత శనివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మనోజ ఇంట్లో ఉండగా తన భర్తమార్కెట్ నుంచి వచ్చేసరికి కూర వండకపోవడంతో వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి అలిగిన మనోజ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. ఎంత కొట్టినా తలుపులు తీయకపోవడంతో గ్రామస్థుల సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. మృతురాలి తల్లి ముద్దం వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు. మనోజకు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వ్యాన్ ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి

మల్లాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలో వ్యాన్‌ఢీకొని ఎర్రచిన్న బావయ్య(55) అనే వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలప్రకారం.. మండలంలోని సాతారం గ్రామానికిచెందిన ఎర్రచిన్న బావయ్యకు భార్య ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. ఎర్రచిన్నబావయ్యా గల్ఫ్‌వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చిన్న కూతురు వివాహం చేయడానికి ఇటీవల గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్ గ్రామంలోఉన్న తనపెద్ద కూతురిని కలిసి ద్విచక్ర వాహనంపై సాతారం గ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో ముత్యంపేట నుంచి యూసుఫ్‌నగర్ గ్రామానికి వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఎర్రచిన్న బావయ్యా తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.

శతాధిక వృద్ధురాలు మృతి



రాజమ్మ(ఫైల్)

మానకొండూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌కు చెందిన పోగుల రాజమ్మ(102) అనే శతాధిక వృద్ధురాలు ఆదివారం అనారోగ్యంతో మృతిచెందింది. రాజమ్మకు ముగ్గురు, కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 16మంది మనుమలు, మనుమరాలతోపాటు మునిమనుమలు, మనుమరాలు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మానేరు పరివాహక ప్రాంతం తనుగుల గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీస్‌లు ఆదివారం పట్టుకున్నారు. ట్రాక్టర్లు నడుపుతున్న డ్రైవర్లు పుల్లసురేష్, నేదురి ప్రశాంత్, దండేబోయిన రాజు, రాజ్‌కుమార్, వెంకటయ్యను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

మానేరు తీరాన ఆధ్యాత్మిక క్షేత్రం

● మైలారం మల్లికార్జునస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న భక్తులు

● కొనసాగుతున్న గిరి ప్రదక్షిణ, జ్యోతిర్లింగాల ఏర్పాటు పనులు



గుట్టపైన ఆలయంలో కొలువుదీరిన మల్లికార్జునస్వామి

గన్నేరువరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మానేరు తీరంలోని మైలారం మల్లికార్జునస్వామి ఆలయాన్ని భక్తులు అభివృద్ధి చేస్తున్నారు. గన్నేరువరం మండలంలోని మైలారం గ్రామ శివారులో ఈ ఆలయం ఉంది. ఆలయ పరిసరాలు గుట్టలు, మానేరుడ్యాం ఆహ్లాదభరితంగా ఉంది. గ్రామశివారులోని 50ఎకరాల విస్తీర్ణంగల గుట్టపై వెలసిన మల్లిఖార్జునస్వామి ఆలయానికి ప్రతి ఆది, బుధవారాల్లో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి బోనాలు సమర్పించి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయం చుట్టూ కిలోమీటర్ పరిధిలో గిరి ప్రదక్షిణ ఏర్పాటుకు రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ గిరి ప్రదక్షిణ మార్గంలోనే గుట్ట చుట్టూ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయాలతో పాటు మరో ఐదు ఆలయాలను నిర్మిస్తున్నారు. ఆలయం గర్భగుడితోపాటు ఆలయం చుట్టూ షష్టి ఏడు వారాలు, ఉగాది ముందు రోజుల్లో పచ్చి పసుపు రాలడం స్వామివారి మహిమకు నిదర్శనం.

భీమన్న ఆలయంలో భక్తుల రద్దీ

● కార్తీక సామూహిక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



భీమన్న ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమన్నఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులు భీమన్న ఆలయంలో కోడెమొక్కులు చెల్లించు కున్నారు. సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా దీపా లను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

యూటర్న్‌లు యమ డేంజర్

● ప్రమాదాలకు దారితీస్తున్న చౌరస్తాలు, మూలమలుపులు

● సూచికలు పాటించని వాహనచోదకులు

● ప్రాణాలు తీస్తున్న అతివేగం, మద్యం





ప్రమాదకరంగా ఉన్న రగుడు చౌరస్తా

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రహదారులపై యూటర్న్‌లు యమ డేంజర్‌గా మారాయి. సిరిసిల్ల శివారులోని యూటర్న్‌ల వద్ద ఇటీవల ఇద్దరు మృతిచెందారు. అంతకుముందు రెండవ బైపాస్ రహదారిలో యూటర్న్ తీసుకుంటుండగా ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. రహదారులపై ఏర్పరిన ప్రమాదసూచికలను వాహనచోదకులు పాటించడంలేదు. దీంతో ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రధా నంగా మద్యం సేవించి వాహనాలు నడుపడమే కాకుండా అతివేగం ప్రాణాలు తీస్తున్నాయి.

● **ప్రమాద రహిత చర్యలు**

సిరిసిల్ల పట్టణంలోని రోడ్లపై ఇటీవల ప్రమా దాలు పెరగడంతో పోలీసులు ప్రమాద రహిత చర్యలు చేపట్టారు. పట్టణంలో వాహనాల రద్దీ పెరుగడంతో పలుచోట్ల హోంగార్డులను ఏర్పరిచారు. రోడుపై ప్రమాదాలు చోటుచేసుకోకుండా జా గ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాదాల నివా రణపై పోలీసులు ప్రత్యేక దృష్టిపెట్టారు. డివైడర్ వద్ద ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటిస్తు న్నారు. రహదారుల మధ్యలో ఉన్న డివైడర్‌ల వద్ద సూచిక బోర్డులు ఏర్పరిచారు. ప్రమదాలపై పోలీసులు చెక్ పెట్టారు. ప్రమాదాల నివారణకై హెచ్చరిక బోర్డులు బిగించారు. పట్టణంలో ఏ వాహనమైనా 20కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా వెళ్లవద్దని సూచించే బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రధానంగా సిరిసిల్ల పట్టణ శివారులోని కొత్త చెరువు, కార్గిల్ లేక్, పద్మనాయక కల్యాణ మండ పం, రగుడు చౌరస్తా తదితర ప్రాంతాల్లో సూచిక బోర్డులు అమర్చారు. జిల్లాలోని ప్రధాన రహదా రులపై సూచిక బోర్డులు, అద్దాలు, సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. దీంతో రహదారి మధ్యలో ఉండే డివైడర్ల వద్దప్రమాదాల హెచ్చరికను సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు.

● **ప్రమాదాలకు నెలవులు**

జిల్లాలో పలుచోట్ల యూటర్న్‌లు ప్రమాదాలకు నెలవుగా మారాయి. ఇటీవల వాహనాలు ఢీకొని ప్రమాదాలు ఎక్కువగా సంభవించాయి. వేముల వాడ నుంచి సిరిసిల్ల రహదారిలోని రగుడు చౌర స్తా, చంద్రంపేట చౌరస్తా, తంగళ్లపల్లి వైపు వెళ్లే మానేరు వంతెన చౌరస్తా, సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్‌లేక్, అంబేద్కర్‌చౌరస్తా, మున్సిపల్ కార్యాల యం, నేతన్న విగ్రహం, వెంకంపేట రోడ్డు, సిరిసిల్ల మీసేవ, బీవైనగర్ రోడ్డు, కామారెడ్డి రోడ్డు, కొత్తచెరువు, పద్మనాయక కల్యాణమండపం, ఆర్టీవో కార్యాలయం వద్ద మలుపులు, చౌరస్తాలు ప్రమా దాలకు దారులయ్యాయి. ప్రధానంగా రహదారి మధ్యలో వాహనాలు వెళ్లేందుకు వీలుగా డివైడర్ లను వదిలివేయడంతో వాహనదారులు యూట ర్న్‌లు తీసుకొని ఎదురుగా రావడంతో ప్రమాదా లకు కారణమవుతున్నాయి.

రోడ్డు భద్రతా చర్యలు పాటించాలి..

- మహేష్ బి. గీతే, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల జిల్లా

ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతను పాటించాలి. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ప్రధానంగా మద్యం సేవిస్త వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. అతివేగంగా వెళ్లవద్దు. పట్టణంలో ట్రాక్టర్లు, బస్సులు, లారీలు, ఇతర ఏ భారీ వాహనాలైనా 20 కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా వెళ్లకుండా చూసుకోవాలి. ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరు తోడ్పడాలి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తిమ్మాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన బినపల్లి నరసయ్య నుస్తులాపూర్ నుంచి తన ద్విచక్రవాహనంపై మన్నెంపల్లికి ఇంటికి వెళ్లే క్రమంలో ఇందిరానగర్‌వద్ద రోడ్డు దాటుతుండగా కరీంనగర్‌వైపు నుంచి హైదారాబాద్ వైపునకు అతివేగంగా, అజాగ్రత్తగా వెళ్తున్న లారీ నరసయ్య వాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో నరసయ్యకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

మల్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం తాటిపల్లిలో ఆదివారం ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విద్యుత్‌స్తంభాలను తరలిస్తుండగా మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు బోల్తాపడింది. గ్రామస్థులు ట్రాక్టర్‌ను అక్కడి నుంచి తరలించారు.



బోల్తాపడిన ట్రాక్టర్

నిరాధార ఆరోపణలతో ఎమ్మెల్యే నాపై కేసులు పెట్టించారు

● మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నిరాధారమైన ఆరోపణలతో తనపై కేసులు పెట్టి రాజకీయ పబ్బం గడుపుతున్నారని మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తనను దూషించారని దానిపై ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తు ఆదివారం మండలంలోని ఎల్ఎండీ కాలనీ పోలీస్‌స్టేషన్‌కు రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావుతో కలిసి చేరుకున్నారు. ఎమ్మెల్యేపై కేసునమోదు చేయాలని రసమయి బాలకిషన్ సీఐ సదన్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గతంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తనను దుర్భాషలాడినట్లు ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసునమోదు చేసి రసమయి బాలకిషన్‌కు నోటీసులు పంపారు. దీంతో మాజీఎమ్మెల్యే రసమయి ఆదివారం అడ్వకేట్‌తో కలిసి స్టేషన్ బెయిల్ కోసం వచ్చారు. వారితో భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చారు. పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లి తిరిగి బయటకు వచ్చిన అనంతరం రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. గత సెప్టెంబరులో జర్నలిస్టుల సాక్షిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నన్ను దుర్భాషలాడారని ఆరోపించారు. తన ఇంటిపై దాడి చేసి ఇంట్లో ఉన్న మనుషులపై దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. తనను దుర్భాషలాడిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రాతికేయుల సాక్షిగా తనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఫ్యాబ్రికేటెడ్ వీడియోఅండ్‌ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా రసమయి బాలకిషన్ వాయిస్‌తో ఒకవీడియో విడుదలచేశారని ఆరోపించారు. దానిపైన ఎమ్మెల్యే పోలీసులకు ఫిర్యాదుచేస్తే దానికోసం మమ్మల్ని పిలిచారని అన్నారు. అదేవిధంగా రసమ యిని ఎమ్మెల్యే కవ్వంపల్లి బూతులు తిట్టడం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంపై కూడా విచారణ జరపాలని మేము కూడా ఫిర్యాదు చేశామని విచారణ చేస్తామని పోలీ సులు అన్నారని తెలిపారు. వారివెంట బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఉల్లెంగుల ఏకనందం, రావుల రమేష్, నాయిని వెంకట్ రెడ్డి, మాతంగి లక్ష్మణ్, సిద్దం వేణు ఉన్నారు.

ఇద్దరి ఫిర్యాదులపై విచారణ చేస్తున్నాం

- తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారని, ఇద్దరి ఫిర్యాదులపై విచారణ చేస్తు న్నాంఅని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇద్దరు కూడా వాయిస్ తమది కాదని ఆరోపిస్తున్నారని అన్నారు. అయినా వాటిపై టెక్నికల్ ఇన్‌వెస్టిగేషన్ కొనసాగుతుందని అన్నారు.. పోలీసులు చేసే విచారణకు ఇద్దరు సహకరించాలని సీఐ సదన్ కుమార్ కోరారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ రావు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ రావు

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్‌రావు ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పాలన సాగిస్తున్నదని ఆయన విమర్శించారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని ఏచూరి సీతారాంనగర్‌లో జగిత్యాల జిల్లా సీఐటీయూ నాలుగో మహాసభలకు హాజరైన ఆయన మాట్లాడుతూ కార్మికుల చట్టాలను బలహీనం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. కొత్త లేబర్ పాలసీని తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో కనీస వేతన చట్టాన్ని సవరించి పెరిగిన ధరలకు అనుగుణంగా 26 వేల వేతనాలు ఇవ్వాలని ఎన్నిసార్లు విన్నవించినా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్‌లను అమలు చేయమని తేల్చి చెప్పిన దమ్మున్న ప్రభుత్వం కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వమని కొనియాడారు. అంతకు ముందు సీఐటీయూ మహా సభలను జిల్లా కో-కన్వీనర్ ఇందురు సులోచన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, జిల్లా నాయకులు గుగ్గిల్ల స్వప్న, వెంకటా చారి, జగిని ఎల్లయ్య, కుంచం శంకర్, సునీల్, శ్యాం,బోర్ర శేఖర్, మహ్మద్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కోతులు..



రంగపేట-అన్నారం మధ్య ఉన్న చెరువు కట్టపై కోతుల సంచారం

మానకొండూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు కోతుల బెడదతో వణికిపోతున్నారు. ఇళ్లలోకి గుంపులు, గుంపులుగా వస్తూ ప్రజలను భయాందోళనలను గురి చేస్తున్నాయి. మండలంలోని మానకొండూర్, ఈదుల గట్టెపల్లి, రాఘవాపూర్, అన్నారం, లింగాపూర్, జగ్గయ్యపల్లి, శ్రీనివాస్‌నగర్, ముంజంపల్లి, గట్టుదుద్దెనపల్లి, లింగాపూర్, రంగపేట, దేవంపల్లి గ్రామాల్లో కోతులు ఎక్కువగా ఉన్నాయి. ఉదయాన్నే ఇంట్లోకి వచ్చి అన్నం గంజులను ఎత్తుకెళుతున్నాయి. అడ్డుపడితే దాడికి దిగుతున్నాయి. ఇళ్లల్లోని చెట్ల కాయలు తెంపి పడేస్తున్నాయి. గ్రామ సమీపాల్లో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ, మొక్కజొన్న పంటలతోపాటు వరిపంటలను నాశనం చేస్తున్నాయి. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వర్షంతో నేలకొరిగిన వరి

పెగడపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి కోతదశకొచ్చిన వరి పంటలు నేలవాలి రైతులకు నష్టం సంభవించింది. ఆరుగాలం శ్రమించి పండించిన అన్నదాతకు శనివారంరాత్రి కురిసిన అకాలవర్షం ఈదురుగాలులకు రాజారాంపల్లి, ఎల్లాపూర్, కీచులాటపల్లి, ఏడుమోటలపల్లి, పెగడపల్లి గ్రామాలలో వందలాది ఎకరాలలో వరి పంటలు దెబ్బతిన్నాయి.



పెగడపల్లి మండలంలో నేలకొరిగిన వరి పైరు

జంక్‌ఫుడ్‌తో ప్రమాదం..

● చిన్న పిల్లలకు అలవాటు చేయొద్దంటున్న వైద్యులు



సుభాష్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జంక్‌ఫుడ్ పిల్లలఆరోగ్యంపై తీవ్రప్రబావం చూపుతుంది. ఆకర్షణీయంగా కనిపించే రకరకాల చిప్స్, చాక్లెట్స్, ఇతర తినుబండారాలు కొనివ్వాలని పిల్లలు మారాం చేస్తుంటారు. సరదాగా కొనిచ్చే వస్తువులతో పిల్లలఆరోగ్యం దెబ్బతింటుంది. పిల్లల ఆరోగ్యంపై కేంద్రఆరోగ్య సంస్థలు ప్రతిఐదు సంవత్సరాలకు ఒకసారి సర్వేలు నిర్వహిస్తారు. ఆ సర్వేలో ఎన్నో ఆందోళకర విషయాలు వెలుగుచూశాయి. జంక్ ఫుడ్‌కు అలవాటు పడిన పిల్లలు వారి వయసుకు తగ్గ బరువు ఉండరు. ప్రతి 100మందిలో 15 మంది పిల్లలు టైప్-2డయాబెటిక్ బారిన పడినట్లు తెలిసింది. జంక్‌ఫుడ్‌లో పిల్లలను ఆకర్షించేందుకు అధిక చక్కెర, కొవ్వులు, ఉప్పు వాడతారు. ఇది పిల్లల్లో ఊబకాయానికి దారితీస్తుంది. జంక్ ఫుడ్‌లో పిల్లలకు అవసరమైన పోషకాలు ఉండవు. పిల్లల్లో ఎదుగుదలకు అవసరమైన విటమిన్లు, ఖనిజాలు లోపిస్తాయి. జంక్ ఫుడ్ తినడం వల్ల దంత సమస్యలు వస్తాయి.

● చిన్న పిల్లలకు జంక్‌ఫుడ్ ఇవ్వొద్దు..

- డాక్టర్ సతీష్‌కుమార్, ప్రభుత్వ చిన్నపిల్లల వైద్యులు



పిల్లలకు జంక్‌ఫుడ్ అలవాటు చేయొద్దు. జంక్‌ఫుడ్ ఎటువంటి పోష కాలు ఉండవు. అనారోగ్య కారకాలైన కొవ్వు, చక్కెర పదార్థాలు అధికంగా ఉంటాయి. జంక్‌ఫుడ్ తినే పిల్లలు ఉండాల్సిన ఎత్తు లేకపోవడం, ఊబకాయంతో బాధ పడతారు. జీర్ణకోశ వ్యాధులు వచ్చేఅవకాశాలు ఉంటాయి. సాధ్యమైనంతవరకు తాజాపండ్లు, కూరగాయలు, పప్పులు, పాలు, గుడ్లు ఇవ్వాలి. జంక్‌ఫుడ్‌కు ఎంత దూరం ఉంటే అంత మంచిది.

● సమతుల ఆహారం ఇవ్వాలి

పిల్లలకు సమతుల ఆహారం ఇవ్వాలి. పిల్లలకు ప్రతి రోజు ఇచ్చే ఆహారంలో ధాన్యాలు, పప్పు గింజలు, పాలు, పెరుగు, ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, కొవ్వు పదార్థాలు, నూనెలు, విత్తనాలు ఉండేలా చూసుకోవాలని ఐసీఎంఆర్ (భారత వైద్య పరిశోధన మండలి), ఎన్ఐఎన్(జాతీయ పోషకాహార సంస్థ) సూచించాయి. ప్రతిరోజు గుడ్డు భోజనంలో తప్పనిసరిగా ఉండాలి.

తైక్వాండో జాతీయ పోటీలకు రెఫరీగా ప్రవీణ్‌కుమార్


ప్రవీణ్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జూనియర్ తైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన కోచ్ బుర్ర ప్రవీణ్ కుమార్ రెఫరీగా ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో ఈనెల 31నుంచి నవంబరు రెండో తేదీ వరకు జరగనున్న 42వజూనియర్ జాతీయస్థాయి పోటీలకు ప్రవీణ్‌కుమార్ టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించనున్నారు. అవకాశం కల్పించిన తెలంగాణ తైక్వాండో సంఘం ప్రధానకార్యదర్శి ఎ ప్రవీణ్‌కుమార్‌కు ధన్యావాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బుర్ర ప్రవీణ్‌కుమార్‌ను జిల్లాయువజనక్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

కాకతీయ కాలువకు 4 వేల క్యూసెక్కుల నీటి విడుదల


కాకతీయ కాలువలో పారుతున్న నీరు

జగిత్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ఆదివారం 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా 4వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

ఎంకేయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవికుమార్

సుభాష్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాలకులాల యునైటెడ్ ఫోరం (ఎంకేయూఎఫ్)రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జిల్లా ఇన్‌చార్జిగా కరీంనగర్‌కు కేంద్రానికి చెందిన రౌతు రవికుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మస్తాదయానంద ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన వారందరికీ రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

- ఫిట్‌నెస్ లేకుండానే రోడ్లపైకి..
- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావుడి



కాంట్రాక్ట్ క్యారేజ్‌లపై నియంత్రణ ఏది?

తిమ్మాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులు (ప్రైవేట్) అంటే ఒక నిర్దిష్ట ప్రయాణం లేదా సమయం కోసం ఒక వ్యక్తి లేదా సంస్థకు అద్దెకు ఇచ్చేవి. ఈ బస్సులను సాధారణంగా వివాహాలు, విహారయాత్రలు, కార్పొరేట్ ఈవెంట్‌లు, ప్రైవేట్ అవసరాల కోసం బుక్ చేసుకుంటారు. దీన్ని కొందరు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. నిత్యం సుదూర ప్రాంతాలకు బస్సులను నడుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బస్సులపై నియంత్రణ లేకపోవడంతో కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతూ ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం లేదు. ప్రతి యేటా కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులకు చేయించాల్సిన ఫిట్నెస్ పరీక్షలు చేయించడం లేదు. సరైనా పత్రాలు లేకుండ, కాలం చెల్లిన బస్సులను రోడ్లపై తిప్పుతున్నారు.

● పలు ప్రాంతాలకు ప్రైవేటు బస్సులు

జిల్లా కేంద్రం నుంచి హైదారాబాద్, నాగ్‌పూర్, బెంగళూరు, బొంబాయి, షిర్డీ, పూణే, ఛత్తీస్‌గఢ్, ఇతర ప్రాంతాలకు కొన్ని ట్రావెల్స్ బస్సులు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. కొందరు కాంట్రాక్టు క్యారియర్ అనుమతి తీసుకుని స్టేజ్ క్యారియర్‌గా బస్సులను నడుపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పార్సళ్లు, లగేజీలు చేరవేస్తున్నారు. పరిమితికి మించి లగేజీని తీసుకువెళ్లడం ద్వారా ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాద తీవ్రత పెరుగుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ప్రైవేట్ బస్సు నిర్వహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంట్రాక్ట్ క్యారేజ్ (సీసీ) బస్సుల వివరాలు

జిల్లా	సీసీ బస్సులు	ఫిట్‌నెస్ చేయించినవి	ఫిట్‌నెస్ లేనివి
రాజన్న సిరిసిల్ల	52	45	07
జగిత్యాల	134	77	57
పెద్దపలి	88	66	22
కరీంనగర్	182	102	80
మొత్తం	456	290	166

బస్సుల యజమానులు నిబంధనలు పాటించాలి

– శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్టీవో, కరీంనగర్



ఆలిండియా పర్మిట్‌తో నడిచే కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులు దాదాపుగా కరీంనగర్‌లో లేవు. స్లీపర్ కోచ్‌లకు రాష్ట్రంలో అనుమతి లేదు. అనుమతి ఉన్న రాష్ట్రాల్లో తక్కువ ట్యాక్స్‌తో పర్మిట్ తీసుకొని అక్కడి నుంచే నడిపిస్తున్నారు. కరీంనగర్ నుంచి బెంగుళూర్, బొంబాయి, ఛత్తీస్‌గఢ్ లాంటి ప్రాంతాలకు ప్రైవేట్ బస్సులు నడుస్తున్నాయి. అన్నింటిపై తనిఖీలు నిర్వహిస్తాం. పత్రాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలపై చర్యలు తీసుకుంటాం. బస్సుల యజమానులు నిబంధనలు పాటించాలి.

స్లీపర్ బస్సులు భద్రమేనా..?



జగిత్యాల టౌన్: జగిత్యాల నుంచి ముంబై, భీవండి లాంటి ప్రాంతాలకు ప్రతి రోజు వందల మంది వెళుతుంటారు. వీరందరూ ప్రైవేట్ బస్సుల వైపే మొగ్గు చూపుతున్నారు. జగిత్యాల నుంచి ప్రతిరోజు ఐదు స్లీపర్ కోచ్‌లు ముంబైకి నడుస్తుంటాయి. కర్నూలు బస్సు ప్రమాద ఘటనతో జగిత్యాల ప్రాంత ప్రజలు ఆందోళకు గురయ్యారు.

● నిబంధనలకు విరుద్ధంగా..

ముంబైకి స్లీపర్ కోచ్‌లు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు విమర్శలున్నాయి. వీటికి కాంట్రాక్ట్ క్యారేజీలుగా అనుమతి తీసుకుని స్టేజ్ క్యారేజీలుగా నడుపుతున్నారు. బస్సుల్లో మంటలను ఆర్పేందుకు అగ్నిమాక పరికరాలు, ప్రతి కిటికీ వద్ద అద్దాన్ని పగులగొట్టేందుకు హ్యామర్‌ను (సుత్తి) ఉంచాలి. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో అలారం మోగితే నిద్రలో ఉన్న ప్రయాణికులు ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నం చేస్తారు. ఇలాంటివన్నీ బస్సులో ఉన్నాయా లేదా అని రవాణా శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే తనిఖీలు చేపట్టి మిగితా రోజుల్లో పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు

– ఎం శ్రీనివాస్, ఆర్టీవో, జగిత్యాల

జగిత్యాల నుంచి ముంబై పలు స్లీపర్ కోచ్ బస్సులు నడుస్తున్నాయి. జిల్లాలో అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటాం.

సేంద్రియ వ్యవసాయం చేస్తున్న..
రైతుకు అరుదైన గౌరవం


రైతు సుధాకర్‌ను సన్మానిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

సుల్తానాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా సేంద్రియ వ్యవసాయంతో పంటలు పండిస్తున్న ఓరైతుకు అరుదైన గౌరవం దక్కింది. మండలంలోని పెరుకపల్లి గ్రామానికి చెందిన నలువల సుధాకర్ సేంద్రియ వ్యవసాయం చేస్తూ వరి, వివిధ రకాల కూరగాయలు, పప్పుదినుసులు, మిరప, పసుపు సాగు చేస్తున్నాడు. గ్రామంలో ఎద్దు గానుగ ద్వారా వేరుశనగ నూనెను ఉత్పత్తి చేస్తూ ప్రజలకు ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. గ్రామ రైతులతోకలిసి పెద్దపల్లి రైతు ఉత్పత్తి సంస్థ ఏర్పాటు చేసి రైతులకు పలురకాల సేవలు అందిస్తున్నారు. రైతు నలవాల సుధాకర్ చేస్తున్న సేంద్రియ వ్యవసాయ సేవల గురించి జిల్లా వ్యవసాయ అధికారులు రాష్ట్ర, కేంద్రప్రభుత్వానికి నివేదికలు అందించారు. సుధాకర్ సేవలను గుర్తించిన రైతు నేస్తం స్వర్ణ భారత్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉత్తమ రైతుగా ఎంపిక చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సుల్తానాబాద్ మండలానికి చెందిన రైతు సుధాకర్‌కు ఈ అరుదైన గౌరవం దక్కడం వల్ల మండల వ్యవసాయ అధికారులు, రైతులు అభినందనలు తెలిపారు.

కంబైండ్ డిస్ట్రిక్ట్ జట్టుపై దక్కన్ వండర్స్ గెలుపు


హెచ్‌సీఏ క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహిస్తున్న జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ ఆదివారం నిర్వహించిన ఏ డివిజన్‌వన్డే లీగ్ కం నాటౌట్ క్రికెట్ పోటీల్లో దక్కన్ వండర్స్ జట్టు కంబైండ్ డిస్ట్రిక్ట్ జట్టుపై ఒక వికెట్ తేడాతో గెలుపొందింది. జిల్లా కేంద్రానికి సమీపంలోని అల్గునూరులో నూతనంగా నిర్మించిన వెలిచాల జగపతిరావు మెమోరియల్ క్రికెట్ మైదానంలో నిర్వహించిన ఈ మ్యాచ్‌లో మొదటబ్యాటింగ్ చేసిన కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టు 43ఓవర్లలో 196పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వండర్స్ జట్టు 42.3ఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 200పరుగులు చేసి ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కంబైండ్ డిస్ట్రిక్ట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారుడు ధర్మపురి సాత్విక్ 9ఓవర్లు వేసి 27పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ పోటీలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులతోపాటు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు వి ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు, కె మహేందర్ గౌడ్, పి మనోహర్‌రావు, శ్రవణ్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. వారంతపు సెలవుదినంతో పాటు కార్తిక మాసం కావడంతో వేకువజాము నుంచే కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకొని బేతాళుడు, రాముల వారి వద్ద కూడా పూజలు చేశారు.


కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు

కోటిలింగాలలో నేడు గోదావరి హారతి

వెల్గటూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయ సమీపంలో సోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయచైర్మన్ పూదరి రమేష్, కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి తెలిపారు. కార్తీక మాసం ప్రతీ సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం 5.30గంటలకు హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గోదావరిహారతి కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఒక ప్రకటనలో కోరారు.

మున్సిపల్ అకౌంట్స్ ఆఫీసర్లకు పదోన్నతులు కల్పించాలి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 13 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న అకౌంట్స్ ఆఫీసర్లకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ మున్సిపల్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శివలింగం కోరారు. ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్లుగా పనిచేస్తున్న అకౌంట్స్ ఆఫీసర్లకు పదోన్నతులు కల్పించలేదని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 29అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీలకు ఏవో పోస్టులను మంజూరు చేయాలని, ఆ పోస్టుల్లో వివిధ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న అకౌంట్స్ ఆఫీసర్లకు అవకాశాలు కల్పించాలని కోరారు. జీవో218 ప్రకారం వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆదాయవనరులను ఆధారంగా చేసుకొని ఏవో, జేఏవో పోస్టులను నూతనంగా మంజూరు చేయాలన్నారు. జీవో 317 ప్రకారం మార్చిన జేఏవో పోస్టులను జోనల్ లెవల్స్ నుంచి మల్టీజోన్ పోస్టులుగానూ, ఏవో పోస్టులను రాష్ట్ర పోస్టులుగానూ మార్చాలన్నారు. సీనియర్ అకౌంటెంట్, జేఏవో, ఏవోలను నూరుశాతం పదోన్నతుల ద్వారానే నియమించాలన్నారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ పాతజిల్లాల్లో గల వివిధ మున్సిపాలిటీల నుంచి జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఆమేరకు తీర్మానించినట్లు ప్రకటించారు. అనంతరం రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న అధికారుల సమస్యలు, హక్కులపై చర్చించి పలు తీర్మాణాలు చేశారు. సమావేశంలో రాష్ట్రంలోని 159మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 180 మంది అకౌంట్ ఆఫీసర్లు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, సీనియర్ అకౌంటెంట్లు, జూనియర్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివలింగం

25శాతం బీసీ విద్యార్థులకు ఇంటర్ అడ్మిషన్లు ఉచితంగా ఇవ్వాలి

గణేశ్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్థాయి జూనియర్ కళాశాలలో ప్రభుత్వం నిర్ణయించిన ట్యూషన్ ఫీజులకే బీసీ విద్యార్థులకు పేదవారికి 25శాతం అడ్మిషన్ ఇవ్వాలని బీసీసంఘాల పక్షాన కోరుతున్నామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. 2026-27 విద్యాసంవత్సరం సంబంధించిన అడ్మిషన్లప్రక్రియ ప్రారంభమైనవి కనుక ఈ తరుణంలో దారిద్రరేఖకు దిగువన ఉన్న బీసీ విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన ట్యూషన్ ఫీజులకే అడ్మిషన్లు ఇవ్వాలని బీసీసంఘాల పక్షాన కోరుతున్నామన్నారు. కార్పొరేటర్ స్థాయి జూనియర్ కళాశాలలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కన్నా ఎక్కువ ఫీజులు తీసుకుంటున్నాయన్నారు. ఇటీవల కార్పొరేట్ కళాశాలలు అడ్మిషన్ టెస్ట్ పేరిట విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ ఇస్తామని ప్రకటించారని తెలిపారు. అదేవిధంగా పేద బీసీవిద్యార్థులకు 25శాతం సీట్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ట్యూషన్ ఫీజులకు మాత్రమే అడ్మిషన్ ఇవ్వాలని బీసీ సంఘాల పక్షాన కోరారు.

తెలంగాణ మైనార్టీ గెజిటెడ్ అధికారుల సంఘం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనార్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడికరీంనగర్ జిల్లా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని ఓప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రియాజ్ అలీ అధ్యక్షతన తెలంగాణ మైనార్టీస్ గెజిటెడ్ అధికారులసంఘం సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా ముహమ్మద్‌సిరాజ్ (డీఈఈ), ముహమద్ అబ్దుల్‌అజీజ్ (ఎఈఈ), జనరల్ సెక్రెటరీగా, సహ అధ్యక్షుడిగా ఎండీ వాజిద్ అలీ (డీఈఈ)తో సహా 27మందితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అంతకుముందు రాష్ట్రఅధ్యక్షుడు మాట్లాడుతూ మైనార్టీ అధికారులు విధులను సక్రమంగా నిర్వహించినప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కొంతమంది ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు మైనార్టీ అధికారులను వేధిస్తే సహించేది లేదన్నారు.

నేటి నుంచి ఉపాధి గ్రామ సభలు

కొడిమ్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల27 నుంచి ఉపాధిహామీ గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వరూప, ఏపీవో సతీష్ తెలిపారు. 27నమండలంలోని అప్పారావుపేట, గౌరాపూర్, 28నచింతల్లపల్లి, కొడిమ్యాల, నర్సింహులపల్లి, 29న డబ్బుతిమ్మయ్యపల్లి, కొండాపూర్, నల్లగొండ, 30న హిమ్మతురావుపేట, రామ కిష్టాపూర్, నమిలికొండ, 31న నాచుపల్లి చెప్యాల గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. నవంబరు1న పూడూర్, శ్రీరాములపల్లి, 3నశనివారంపేట, దమ్మయ్యపేట, తిర్మాలాపూర్, తురుకకాశీనగర్, 4న రాంసాగర్, గంగారాంతండా, కోనాపూర్, సూరంపేట, తిప్పయ్యపల్లి గ్రామాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభలకు ప్రజలు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.


ధర్మపురి వద్ద గోదావరి హారతి

ఘనంగా గోదావరి హారతి

ధర్మపురి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆదివారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు గోదావరినది వద్ద విశేషపూజలు జరిపారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, పంటలు సమృద్ధిగా పండాలని నదీమాతను వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, ఆలయఉపప్రధాన అర్చకులు నేరెళ్లశ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్లకిరణ్ పాల్గొన్నారు.


గోదావరి నదిలో దీపాలు వదిలిపెడుతున్న భక్తులు

శ్రీనివాసులు సమాజ సేవలో ముందుండాలి

భగత్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసులు సమాజసేవలో ముందుండాలని చిలుకూరి బాలాజీ సుందరేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకుడు, ధర్మ సంస్థాపన అధ్యక్షుడు రామదాసి ఆత్మారాం సురేష్ అన్నారు. ఆదివారం కొత్తపల్లి మండలంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో శ్రీనివాస మిత్రుల ద్వితీయ వార్షికోత్సం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి కలియుగదైవం శ్రీనివాసుని పేరుతో శ్రీనివాస మిత్రులందరూ ఒకచోట చేరి సమాజ సేవ చేయడం అభినందనీమన్నారు. శ్రీనివాసలందరూ దైవ కార్యాలతో పాటు సామాజికసేవలో భాగస్వాములు కావాలన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసులు


రక్తదానం చేస్తున్న చిలుకూరి బాలాజీ ఆలయ పూజారి సురేష్ ఆత్మారాం మహారాజ్, శ్రీనివాసులు

● వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు

రెండు వేల మంది శ్రీనివాస్ పేరు ఉన్న వారందరూ ఒకే వేదికపై చేరడంతో వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు. వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు తెలంగాణ డైరెక్టర్ మడుపు రాంప్రకాశ్ చేతుల మీదుగా తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పూట్కూరి శ్రీనివాస్‌రెడ్డికి సర్టిఫికెట్ అందజేశారు. శ్రీనివాస మిత్రుల ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా కరీంనగర్ ప్రభుత్వాస్పత్రి సహకారంతో తలసేమియా బాధిత పిల్లల కోసం 250 మంది శ్రీనివాసులు మెగా రక్తదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పూట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు వెంట చెట్ల తొలగింపు

● విద్యుత్‌లైన్ కోసం చెట్ల నరికివేత

మల్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డు వెంట నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌లైన్ కోసం చెట్లను తొలగిస్తున్నారు. దిగువ కొండగట్టు నుంచి కొండపై వరకు ఘాట్‌రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్ పనులు చేపట్టగా చెట్లను తొలగించడం పట్ల భక్తులు, స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.


ఘాట్‌రోడ్డు వెంట కొట్టేసిన చెట్లు

ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కిసాన్‌నగర్ ప్రాంతానికి చెందిన నారాయణ అనే ఇంటి యజమాని దళిత సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతీసే విధంగా తన ఇంటి ఎదుట టు-లెట్ బోర్డు ఏర్పాటు చేశారని, అతడిపై చట్టపరమైన చర్యల తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ గోష్కి శంకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు ఎడెల్లి గణేష్, జూకెనపల్లి చింటూ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో ఒక ఇంటి యజమాని నారాయణ తన షట్టర్‌కు 'ఓన్లీ హిందువులకే, నో ఎస్సీ, ఎస్టీ' అని టు-లెట్ బోర్డు పెట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి కుల పిచ్చి యజమానిపైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

తహసీల్దార్ వహిదొద్దీన్



ఆంధ్రజ్యోతి: మండలంలో ఇసుక, మట్టి అక్రమ తరలింపుపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: ఇందిరమ్మ ఇళ్ల నేరుతో ఎవరైనా అక్రమంగా మట్టి, ఇసుకను తరలిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తాం. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ధ్రువ పత్రాలతో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లయితే అనుమతి ఇస్తాం. ఇసుకను ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుంది. లబ్ధిదారులు ట్రాన్స్‌పోర్టు చార్జీలు భరించాలి.

ఆంధ్రజ్యోతి: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ప్రారంభిస్తారు?

తహసీల్దార్: జిల్లా స్థాయి అధికారుల నుంచి అనుమతులు రాగానే ప్రారంభిస్తాం. రైతులు ముందుగా ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం వచ్చిన తర్వాతనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందలి.

ఆంధ్రజ్యోతి: భూభారతి, సాదాబైనామా దరఖాస్తుల ప్రక్రియ ఎంతవరకు వచ్చింది.

తహసీల్దార్: మండలంలో భూ భారతికి 1,266 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ భూముల దరఖాస్తులను తొలగిస్తే మిగతా 518 దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. సాదా బైనామాలకు సంబంధించి 1,018 దరఖాస్తులు రాగా అందరికీ నోటీసులు ఇచ్చాం.

-సారంగాపూర్

సాండ్ బజార్‌లో ఇష్టారాజ్యం

-ఇందిరమ్మ లబ్ధిదారులకు రూ.800లకే టన్ను ఇసుక ప్రకటించిన మంత్రి -అధిక ధరలకు విక్రయించినా పట్టించుకోని అధికారులు

జగిత్యాల టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) :ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుకను అందించాలని ప్రభుత్వ ఖనిజాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని వాణీనగర్‌లో సెప్టెంబర్ 10న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి సాండ్‌బజార్‌ను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.800లకే టన్ను ఇసుక పొందవచ్చని మంత్రి, కలెక్టర్లు సూచించారు. కానీ సాండ్ బజార్‌లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో రూ.1200లకు టన్ను ఇసుక, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు అదనంగా చెల్లించడం వల్ల బహిరంగ మార్కెట్‌లో కంటే అధిక ధర చెల్లించాల్సి వస్తోంది. అదే ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తే మాత్రం రూ.900ల నుంచి రూ.1000 వరకే ఇంటి వద్దకు వస్తుంది. ఆ లెక్కన ట్రాక్టర్ ఇసుకకు రూ.5,500 వరకు పడుతుంది. అదే ప్రైవేట్‌లో రూ.4వేల లోపే ఇంటికి వస్తుంది.

● అధికారుల సమన్వయ లోపంతో లబ్ధిదారులకు శాపం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సాండ్ బజార్ నుంచి ఇసుకను పొందాలంటే సంబంధిత అధికారుల నుంచి కూపన్లు కావాలని సాండ్ బజార్ నిర్వాహకులు చెబుతున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలోని లబ్ధిదారులకు మాత్రం పంచాయతీ కార్యదర్శులు ఇసుక కోసం కూపన్లు రాసి ఇస్తే టన్ను ఇసుకకు రూ.1200లు, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు రూ.600ల నుంచి రూ.1000 వరకు దూరాన్ని బట్టి చెల్లించి తీసుకెళ్తున్నారు. కానీ జగిత్యాల మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులు మున్సిపల్ అధికారులను ఇసుక కూపన్ల కోసం అడిగితే తమకు ఎలాంటి సమాచారం లేదని, రెవెన్యూ అధికారులను అడగాలని చెబుతున్నారు. సాండ్ బజార్‌లో ఇసుక కావాలంటే హౌసింగ్ అధికారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎంత మేరకు ఇసుక అవసరం పడుతుందో ఎస్టిమేట్ చేసి తమకు ఉత్తర్వులు పంపాలంటున్నారు. అందుకు అనుగుణంగా ఇసుక కోసం కూపన్లు ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తామని రెవెన్యూ అధికారులు అంటున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. దీంతో లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సాండ్ బజార్ ద్వారా తక్కువ ధరకు ఇసుక ఇప్పించే విధంగా మంత్రి, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఇందిరమ్మ లబ్ధిదారులు కోరుతున్నారు.



జగిత్యాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ సాండ్ బజార్

ఇసుక టోకెన్ల కోసం ఎవరూ రావడం లేదు

రామ్మోహన్, జగిత్యాల అర్బన్ తహసీల్దార్

ఇందిరమ్మ ఇంటికి ఇసుక ఇవ్వాలంటే ఒక ప్రాసెస్ ఉంటుంది. మొదట ఆ వార్డు ఆఫీసర్ ధ్రువీకరించిన అనంతరం హౌసింగ్ అధికారులు ఎంత ఇసుక కావాలో ధ్రువీకరిస్తారు. మేము దానిపై టోకెన్లు ఇస్తాం. కానీ ఇంతవరకు మా వద్దకు ఎవరూ రాలేదు. టన్నుకు ఇందిరమ్మ ఇంటికి రూ.1200, ఇతర ఇళ్లకు అయితే రూ.1400 చూపిస్తోంది. ఇది భూగర్భ మైనింగ్ శాఖ వారి ఆధీనంలోనే ఉంటుంది.

తప్పని ఎదురుచూపులు

(5వ పేజీ తరువాయి)

మంది పదవీ విరమణ పొంది ఏడాదిన్నర అవుతున్నా బెనిఫిట్స్ మాత్రం అందడంలేదు. వీరందరికీ గ్రాట్యూటీ, జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, టీజీఎల్‌ఐ, కమ్యూటేషన్, జీఐఎస్ లాంటి బెనిఫిట్స్ కింద రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.10 వేల కోట్ల నుంచి రూ.13 వేల కోట్లు వరకు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.

కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేస్తాం

-హరి అశోక్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి

తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్



పెన్షనరీ బెనిఫిట్స్ కోసం ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. బెనిఫిట్స్ బిల్లులు సుమారు రూ.13 వేల కోట్లు రావాల్సి ఉంది. నవంబరు 10లోగా జీపీఎఫ్, గ్రాట్యుటీ, కమ్యుటేషన్, లీవ్ ఎన్‌క్యాష్ మెంట్, జీఎల్‌ఐ బిల్లులు చెల్లించాలి. ప్రభుత్వం ఇంకా స్పందించని పక్షంలో నవంబరు 17న హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులతో ధర్నా చేపడుతాం.

ప్రభుత్వం నిధులు లేవంటోంది

-హన్మంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, టీ పెన్షనర్స్ అసోసియేషన్



నెలకు రూ.700 కోట్లు ఇస్తామని ప్రభుత్వం ఉద్యోగ జేఏసీతో ఇచ్చిన హామీ అమలు కావడం లేదు. తమ దగ్గర డబ్బులు లేవని ప్రభుత్వం చెబుతోంది. పదవీ విరమణ పొందిన పెన్షనర్లు తీవ్ర మనోవేదనలో ఉన్నారు. అవసరాలకు డబ్బులు అందక పిల్లల పెళ్లిలు చేయలేక పోతున్నారు. విడతల వారీగానైనా ప్రభుత్వం పెన్షనరీ బెనిఫిట్స్ విడుదల చేయాలి.

‘నడకతో సంపూర్ణ ఆరోగ్యం’



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్సై సందీప్

కొడిమ్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : శారీరక దృఢత్వానికి ప్రతి ఒక్కరు నిత్యం వాకింగ్ చేయాలని కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని గ్రౌండ్ గ్రూప్, వాకింగ్ అసోసీయేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాకింగ్, సైక్లింగ్ వలన కలుగు ప్రయోజనాలను వివరించారు. వాకింగ్ చేసినట్లయితే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే వాకింగ్ చేయాలన్నారు. ఈ సైకిల్ ర్యాలీలో వాకింగ్ అసోసీయేషన్ సభ్యులు, గ్రామ ప్రముఖులు, పలువురు విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమజ్ఞకు సాహిత్య పురస్కారం

వెల్గటూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని చెగ్యాం గ్రామానికి చెందిన విద్యార్థిని పోడేటి సమజ్ఞకు బాల సాహిత్య విభాగంలో పెందోట సాహిత్య పురస్కారం లభించింది. సమజ్ఞ రాసిని ‘గురువు మాట’ పుస్తకానికి 2025 సంవత్సరానికి గాను బాల సాహిత్య పద్య విభాగంలో సాహిత్య పురస్కారానికి ఎంపికైనట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పెందోట వెంకటేశ్వర్లు ప్రకటించారు.

ప్రతీ సంవత్సరం శ్రీవాణి సాహిత్య పరిషత్, పెందోట బాల సాహిత్య పీఠం సిద్దిపేట సంయుక్తంగా అందించే పురస్కారానికి సమజ్ఞ ఎంపిక కావడం పట్ల పలువురు ఆమెకు ఈసందర్భంగా అభినందనలు తెలిపారు.

రాజ్యాధికార సాధనతోనే యాదవులకు గుర్తింపు

-యాదవ సంఘం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్

రాయికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికార సాధనతోనే యాదవులకు గుర్తింపు లభిస్తుందని యాదవ సంఘం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేష్‌యాదవ్ అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామ యాదవ సంఘ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టగా 51 మంది సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదుతో సంఘ బలోపేతం, సమస్యల పరిష్కారం, న్యాయంగా యాదవులకు దక్కాల్సిన హక్కుల సాధన తదితర విషయాల గురించి చర్చించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రెబ్బాస్ మల్లయ్య, మంత్రి రాజ్ కుమార్, వేల్పుల రవి, జాల రమేష్, దానవేణి రాజు, గోనె నరేష్, పంచతి శంకర్, ధనరేకుల తుక్కారాం, రాయమల్లు, వెంకటేష్, రాజేష్, మల్లయ్య, మల్లేష్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రకృతివనమే..!



మల్యాలలో అధ్వాన్నంగా మారిన ప్రకృతివనం

మల్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతివనాలపై అధికారుల పట్టింపు కరువైంది. వెరసి గ్రామాల్లో ప్రకృతివనాలు దట్టమైన చెట్లు, పిచ్చిమొక్కలతో కళాహీనంగా మారాయి. అహ్లాదం పంచెందుకు ఏర్పాటు చేసిన వీటిలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మల్యాల బ్లాక్ చౌరస్తా సమీపంలో గల ప్రకృతివనం మందు బాబులకు అడ్డగా మారింది. ఆట పరికరాలు పిచ్చిమొక్కలలో కప్పుకోపోయి అధ్వాన్నంగా మారింది.

మైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

బీర్‌పూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలకేంద్రంలో ఇటీవల నూతనంగా నిర్మించిన మైసమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేకమైన వేద మంత్రోచ్ఛరణల మధ్య హోమం నిర్వహించి ఆలయంలో మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, శేఖర్, శైండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవదుర్గా కార్తీక వన భోజనాలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని గోవిందపల్లిలోని నవ దుర్గా పీఠ క్షేత్రంలో ఆదివారం కార్తీక వన బోజనాలు ఘనంగా నిర్వహించారు. గోవిందపల్లిలోని నవ దుర్గా క్షేత్ర పీఠంలో జరిగిన ఈ కార్తీక వనబోజనాలకు వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు.

ఈ కార్తీక వనబోజన కార్యక్రమంలో జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీమాన్ నంబి వేణుగోపాల కౌశిక్‌తో పాటు నవ దుర్గా పీఠ క్షేత్ర వ్యవస్థాపకులు, క్షేత్ర నిర్వహకులు కస్తూరి శ్రీనివాస్, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌కు అవినీతిపై మాట్లాడే అర్హత లేదు’

ధర్మపురి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అవినీతి గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదని టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి హరీష్‌రావు రాష్ట్ర ప్రభుత్వ క్యాబినేట్ ఉద్దేశించి దండుపాళ్యం సినిమాతో పోలుస్తూ మాట్లాడిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఆయన అన్నారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఎటువంటి చర్చకు అయిన సిద్దమని మీడియా ముఖంగా ఆయన సవాల్ విసిరడం జరిగిందని ఆయన అన్నారు. అందులో భాగంగా సిద్దిపేటకు మంత్రి వెళ్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని మీడియాతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. అనంతరం అక్కడికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వచ్చి ప్రభుత్వం పైన తీవ్రమైన అవాస్తవ వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ పక్షాన ఆయన తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎంత అవినీతి జరిగిందో, వారి హయంలో జరిగిన ఏ సంక్షేమ పథకాల అమలులో ఎంత అవినీతి జరిగిందో రాష్ట్ర ప్రజలకు తెలుసునని ఆయన అన్నారు. సంక్షేమ పథకాలు అమలులో అయిన అందులో అవినీతి ఉంటుందని ఆయన తెలిపారు. మాజీ మంత్రి హరీష్‌రావు గురించి మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడితే వారి భజనపరులైన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక సారి అతని స్థాయి మించి మాట్లాడుతున్నారనే విషయం గుర్తు ఉంచుకోవాలని ఆయన అన్నారు. ఇసుక దందా గురించి ప్రజలకు తెలుసునని, కొప్పుల ఈశ్వర్ అధికారంలో ఉన్న సమయంలో ధర్మపురికి ఏమి అభివృద్ధి చేశాడో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. చందాల పైన ఉద్యమాన్ని నడిపిన రజమయి బాలకిషన్ ఇప్పుడు ఇన్ని కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. అధికారం కోల్పోయిన కొప్పుల ఈశ్వర్ ఏమి మాట్లాడుతున్నాడో వారికే అర్థం కావడం లేదని ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయంలో తాగేందుకు నీళ్లు లేక మహిళలు రోడ్ల పైకి రావడం జరిగిందని ఆయన తెలిపారు. మీ ప్రభుత్వ హయంలో పేపర్ లీకేజీలు, నోటిఫికేషన్లు సరిగా ఇవ్వక పోవడం వల్ల నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇప్పటి వరకు సుమారు 60 వేలు ఉద్యోగాలు భర్తీ చేసినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, బుగ్గారం, వెలగటూర్, గొల్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేముల సుభాష్, తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, ముస్కు నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు సంగనభట్ల దినేష్

కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

మెట్‌పల్లిటౌన్,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని ఇంద్ర నగర్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ సేవాళ్ జిల్లా అధ్యక్షుడు నాయిని సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో సేవాదళ్ నాయకులు పూలమాల వేసి,అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కరుణాకర్‌రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్‌కు నూతనంగా మంజూరి అయిన అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అన్నారు.

కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల అభివృద్ధికి నిధుల మంజూరు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరి చేసిదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగరావు ఆదివారం తెలిపారు. నిధులు మంజూరికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడ నర్సింగరావు సన్మానించి అభినందించాడు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ రావు స్థానిక విలేకర్లతో ఫోన్ ద్వారా మాట్లాడారు. కోరుట్ల మెట్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి 37.40 కోట్ల నిధులను మంజూరి చేసినట్లు తెలిపారు. కోరుట్ల మున్సిపల్‌కు 18.70 కోట్ల, మెట్‌పల్లి మున్సిపల్‌కు రూ. 18.70 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిదులు కేటాయించాలని గత వారం రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిని అందించగా సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ముఖ్యంత్రి నిధులు కేటాయించడానికి సుముఖత పలికి కేటాయించారన్నారు. కోరుట్ల మున్సిపల్‌లో 80 ఇండ్లు నిర్మాణం చేసి వాటిని కూడా కార్యకర్తలకు కేటాయించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాడిన తరువాత సుమారు 3000 ఇందిరమ్మ ఇండ్ల ప్రోసిడింగ్ పత్రాలను అందజేసిందని అన్నారు. నిదులు మంజూరి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులకు కృతజ్ఞతలను తెలుపుతున్నాట్లు ప్రకటించారు.

కరీంనగర్ అర్బన్ బ్యాంకును తీర్చిదిద్దుతాం

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో తమ ప్యానల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఇతర బ్యాంకులకు ధీటుగా కరీంనగర్ అర్బన్ బ్యాంకును తీర్చిదిద్దుతామని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంఛార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్యానెల్ అభ్యర్థులు నీతి, నిజాయితీతో సేవలందించేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మెరికల్ లాంటి ఇద్దరు యువకులను ప్రతిపాదించారని, ఎమ్మెల్యే మద్దతుగా ఇద్దరు యువకులను ఇవ్వడం తనకు వెయ్యిఏనుగుల బలాన్ని చేకూర్చిందన్నారు. సమావేశంలో అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులు మూల వెంకటరవీందర్‌రెడ్డి, గాదె కార్తీక్, కూసరి అనిల్, లక్ష్మణ్‌రాజు, అనురాసు కుమార్, వజీర్ మహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, అనంతరాజు, ఫణిత, శ్రీలత రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బట్టు వరప్రసాద్, అనంతుల రమేష్, కనకరాజు, పొన్నం మధు తదితరులున్నారు.

అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని టిజిఓ యూనియన్ జగిత్యాల అధ్యక్షులు గొడిసెల అశోక్ రాజు అన్నారు. ఎన్నో అవమానాలను ఎదుర్కొని, లక్ష్య సాధనలో ముందుండి పీడిత వర్గాలకు అంబేద్కర్ బలగం అయ్యారని టిజిఓ యూనియన్ జగిత్యాల అధ్యక్షులు గొడిసెల అశోక్ రాజు అన్నారు. ఆదివారం అంబేద్కర్ స్మరణం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ దేవానిక అందించిన సేవలు సమానత్వం, న్యాయం సామాజిక సంస్కరణలో వారిఒ ఆలోచనలు ఆవయాలను , ఆదర్శల ద్వారా భవిష్యత్ తరాలు సూర్తి పొందటంతో పాటు స్మరించుకోవాలన్నారు. విద్యానే ఆయుదంగా మలుచుకోవాలని అంబేద్కర్ మనకు సూచించారని అందరు చదువుకోవడం వల్ల నే అంబేద్కరిజం అలవడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహకులు డీక్కి కో - ఆర్డినేటర్ నల్ల శ్యాం, నకుమల్ల లక్ష్మీనారాయణ, కంటె అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

గొల్లపల్లి: గొల్లపల్లి మండల కేంద్రంలో ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణం కార్యక్రమాన్ని మాజీ వైస్ ఎంపిపి ఆవుల సత్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత చెన్నాడి రమణారావు గిల్లపెల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమ నిర్వహకులు ఆవుల సత్యం మాట్లాడుతూ అంబేద్కర్ దేశానిక అందించిన సేవలు సమానత్వం, ససామాజిక న్యాయం, సంస్కరణలో వారి ఆలోచనలు, ఆశయాలను, స్మరించుకోవడం కోసం ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణం కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చేర్మన్ కంపపెల్లి మన్నండ్ల నాయకులు కచ్చు కొంరయ్య, ప్రముఖ న్యాయవాది చిర్ర దిలీప్, శాలివాహన సంఘం అధ్యక్షులు తిరుపతి, నర్సయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి ఆదివారం దాతలు విరాళాలను అందించారు. మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన జల్ద స్వాతిగంగరాజం 11116రూపాయలను, చెప్యాల గ్రామానికి చెందిన దయ్యాల శిరీషఅనిల్ 11116రూపాయలను అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మల్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మల్యాల సింగిల్‌విండో ఆధ్వర్యంలో మల్యాల ఏఎంసీ, సర్వాపూర్, బల్వంతాపూర్, ముత్యంపేటలో ఏర్పాటు చేసిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ రాంలింగారెడ్డి, ఏఎంసీ కార్యదర్శి వరలక్ష్మి, ప్యాక్స్ సీఈవో శ్రీనివాస్ ఉన్నారు.

పోచమ్మతల్లికి ఆభరణాల అందజేత

మల్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేటలో గల పోచమ్మతల్లికి ముంబైలో ఉండే గ్రామానికి చెందిన చెట్‌పల్లి మొండయ్య-అంబవ్వ దంపతుల కుమారులు రమేశ్, మహేశ్, ఆనంద్ వెండి ఆభరణలు అందజేశారు. రెండు కిలోల వెండితో తయారి చేసిన కిరీటం ఇతర ఆభరణాలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పోచమ్మ తల్లికి తొడిగారు.

ఉచిత కంటి చికిత్స

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని పావని కంటి ఆసుపత్రిలో ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో నియోజక వర్గానికి చెందిన 14 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఉచిత కంటి ఆపరేషన్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, నాయకులు క్యాదాసు నాగయ్య, చిర్ర నరేష్ ఉన్నారు.

రెండేళ్లుగా పనిచేయని హైమాస్ట్ లైట్లు

-పట్టించుకోని అధికారులు
-ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కొడిమ్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్ (జెన్‌టీయు-నాచుపల్లి)ఎదురుగా ఉన్న విద్యుత్ లైట్లు సుమారు రెండేళ్ళుగా పని చేయక పోవటంతో ఈ ప్రాంతం నుండి రాక పోకలు సాగించు ప్రయాణీకులు, ఆటోలను నడుపుకుంటు జీవనోపాది పొందుతున్న అటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన లైట్లు వెలుగుతుండటంతో అదె దీమాతో ప్రయాణీకులు ప్రయాణం చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లు రెండేళ్ళుగా పనిచేయక పోవటంతో ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ రహదారి నుండి వస్తూ పోతున్న హైమాస్ లైట్లను వినియోగంలోకి తీసురావటం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో మండలంలోని పూడూర్ బస్ స్టేజీ వద్ద దిగి కొడిమ్యాల వైపు రాక పోకలు సాగించె కొడిమ్యాల మండలంలోని వివిద గ్రామాల నుండి కరీంనగర్ వైపు బస్సు ప్రయాణం చేసె వారు మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్ వద్ద నుండి ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కావటంతో ఈ దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్ బస్టాండ్ ప్రాదాన్యతను సంతరించుకుంది. ఇలాంటి దొంగల మర్రి పోలీస్ చెక్ పోస్టు బస్ స్టేజీ వద్ద విద్యుత్ లైట్లు వెలుగక పోవటంతో రాకపోకలు సాగించు ప్రయాణీకులు ఆవేదన చెందుతున్నారు. సంబందిత అధికారులు పట్టించుకోని పనిచేయని విద్యుత్ లైట్లపై దృష్టి సారించి లైట్లు పని చేయు విదంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



పనిచేయని విద్యుత్ లైట్లు

హైమాస్ట్ లైట్లను వినియోగంలోకి తీసుకురావాలి

దయ్య భాస్కర్, ఆటో డ్రైవర్



దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్టు వద్ద పనిచేయని హైమాస్ట్ లైట్లను వినియోగంలోకి తీసుకరావాలి. హైమాస్ లైట్లు పని చేయక సుమారు రెండు ఏళ్ళుగా తాము ఇబ్బందుల పాలవుతున్నాం. రాత్రివేళ ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చూడాలి.